క్లుప్తంగా

పశుగణన పరిశీలన



ఇంజేడులో పశుగణన వివరాలను అడిగి తెలుసుకుంటున్న డీడీ రమణయ్య

ఉయ్యాలవాడ : మండలంలోని ఇంజేడు గ్రామంలో జరుగుతున్న పశుగణనను ఆళ్లగడ్డ పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు రమణయ్య క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించారు. బుధవారం స్వయంగా రైతుల గృహాల వద్దకు వెళ్లి పశువుల గణనపై ఆరా తీశారు. ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో అన్ని పశు వైద్యశాల పరిధిలో పశుగణన కార్యక్రమం 90 శాతం పూర్తయ్యిందని చెప్పారు. ఏడీఏ వరప్రసాద్, పశు వైద్యాధికారులు రవీంద్రనాథ్‌రెడ్డి, నాగశైలజ, మహాలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థిని స్పందన జాతీయ స్థాయిలో మెడల్ సాధించింది. దీంతో బుధవారం ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరావు, వైస్ ప్రిన్సిపాల్ సురేష్‌కుమార్ విద్యార్థినితో పాటు పీడీ శ్రీనివాసులును అభినందించారు. ప్రిన్సిపాల్ పాట్లాడుతూ ఈనెల 13,14,15 తేదీల్లో మహారాష్ట్రలోని నాసిక్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి జంప్‌రోప్ పోటీల్లో పాల్గొని సత్తా చాటి బ్రాంజ్ మెడల్ సాధించిందని చెప్పారు.

ఇరుముడితో శ్రీశైలం పయనం



ముత్యాలపాడులో ఇరుముడితో శివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న దృశ్యం

చాగలమర్రి: మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో ఈ ఏడాది కార్తీక మాసం ప్రారంభంలో సుమారు 20 మంది భక్తులు శివమాల ధరించి సుమారు 108 రోజల పాటు దీక్ష చేపట్టి బుధవారం శ్రీశైల మల్లికార్జున, భ్రమరాంబికాదేవిని దర్శించుకునేందుకు మాలధారులు ఇరుముడితో శ్రీశైలం దేవస్థానానికి బయలుదేరారు. ఈ సందర్భంగా దీక్ష చేపట్టిన చలపతి అనే భక్తుడు స్థానిక శివాలయంలో బుధవారం తెల్లవారు జాము నుండి 1080 సార్లు ప్రదక్షిణ చేశాడు. అంతేకాకుండా అర్ధ నారీశ్వరి రూపాన్ని ధరించి భవిష్య వాణి వినిపించారు.

జాతీయ స్థాయిలో మెప్పు పొందాలి



ఆదర్శ పాఠశాలలో ప్రాజెక్టులను తిలకిస్తున్న వెంకటేశ్

రుద్రవరం: జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెప్పు పొందేలా నమూనా ప్రాజెక్టులను రూపొందించాలని అటల్ టికరింగ్ ల్యాబ్ స్టేట్ కో ఆర్డినేటర్ వెంకటేశ్ విద్యార్థులకు సూచించారు. మండలంలోని తువ్వపల్లె తిప్పమీదున్న ఏపీ మోడల్ పాఠశాలను బుధవారం జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ సుందరయ్యతో కలిసి సందర్శించారు. వారు మాట్లాడుతూ ఏటీఎల్ కార్యక్రమం పర్యావరణ వ్యవస్థను విప్లవాత్మకంగా మారుస్తూ జాతీయ ఉద్యమంగా మారిందన్నారు. విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త ఆవిష్కరణలు చేయాలని చెప్పారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, ఏటీఎల్ ల్యాబ్ ఇన్‌చార్జ్ నరసింహ ఉన్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలి



డీఆర్‌ఓకు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం డీఆర్‌ఓ రామునాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాముడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని, ముఖ్యమంత్రి మొదటి సంతకం చేశారని, ఇప్పటికీ నోటిఫికేషన్ వెలువడలేదన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులు నోటిఫికేషన్ల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. పృధ్వీకుమార్, హరికృష్ణ, దివాకర్, రజాక్, శివ, రాజు, బాలు పాల్గొన్నారు.

గరిష్ట వేతనం అందదేమి?

ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలకు ఇక నుంచి రోజుకు రూ.300 వేతనం లభిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు నిర్దేశించిన కొలతల మేర పని చేయాల్సి ఉంటుంది. అయితే.. ఎంత పని చేస్తున్నా గరిష్ట వేతనం లభించడం లేదని కూలీలు వాపోతున్నారు. రోజూ ఎంత సేపు పనిచేసినా రూ.270కి మించడం లేదు. ఇదిలా ఉండగా.. వ్యవసాయ పనుల్లో రోజుకు రూ.400 మహిళలకు, పురుషులకు రూ.500 కు పైగా లభిస్తుండటంతో ఆ పనులకే మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయ పనులు లేని ప్రాంతాల కూలీలకు మాత్రం న్యాయమైన కూలి లభించడం లేదు.

- ఉపాధి కూలీలకు అందని రూ.300 వేతనం
- వ్యవసాయ పనులతోనే అధిక కూలి
- శ్రమజీవులకు గిట్టుబాటు కాని ఉపాధి పనులు
- నగటున రోజుకు రూ.270 మాత్రమే లభిస్తున్న వైనం



దొర్నిపాడు వద్ద ఉపాధి పనుల్లో పాల్గొన్న కూలీలు

దొర్నిపాడు: ఇక నుంచి ఉపాధి హామీ పథకంలో పని చేస్తే రూ.300 వేతనం ఇస్తామని అధికారులు చెబుతున్నారు. రోజులు గడుస్తున్నప్పటికీ కూలీలకు ఆ సొమ్ము అందడం లేదు. రోజూ ఎంత శ్రమిస్తున్నా రూ.270కి మించి రావడం లేదు. దీంతో చాలా మంది కూలీలు ఉపాధి పనులపై ఆసక్తి చూపడం లేదు. ముఖ్యంగా వ్యవసాయ పనులున్నప్పుడు వాటిని పట్టించుకోవడం లేదు. వ్యవసాయ పనులకు వెళ్తే తమకు అధికంగా కూలి లభిస్తుందని చెబుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్తే మహిళలకు రూ.400, పురుషలకు రూ.500కు పైగా ఇస్తున్నారు. ఇక వరినాట్ల సమయంలో కూలీలు రోజుకు రూ. వెయ్యికి పైగా సంపాదించుకుంటున్నారు. ఉపాధి హామీ పనులు చేస్తున్నా ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట వేతనం రావడం లేదని కూలీల ఆవేదన చెందుతున్నారు.

గరిష్ట వేతనం ఎక్కడ?

నియోజకవర్గం వ్యాప్తంగా 49,032 జాబ్‌కార్డులు ఉండగా 93,316 మంది కూలీలు ఉన్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు మెండుగా ఉన్నప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పనులు లేకపోవడంతో జనవరి నుంచి ఉపాధి హామీ పనులను ప్రారంభించారు. ప్రస్తుతం రోజుకు రెండువేల లోపే కూలీలు పనులకు హాజరవుతున్నారు. వ్యవసాయ పనులు పూర్తయితే కూలీల సంఖ్యం రెట్టింపయ్యే అవకాశం ఉంది. రూ.300 వేతనం రాకపోవడంతో కూలీలు ఇరకాటంలో పడ్డారు. ప్రస్తుతం పంటకాల్వల్లో పూడికతీత, పాంఫాండ్స్ పనులు చేస్తున్నారు. 2023-2024 ఆర్థిక సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం గరిష్ట వేతనం రూ.300 నిర్ణయించింది. ప్రస్తుతం సగటునా రూ.250 నుంచి రూ.270 వరకు చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ఒక్కో కూలీ రోజుకు రూ.30 నుంచి రూ.50 వరకు నష్టపోతున్నారు. గరిష్ట వేతనం రూ.300 చేసినప్పటి నుంచి ఒక్క కూలీకి కూడా రూ.300 కూలి పడలేదు. కేవలం చెప్పుకోవడానికే తప్ప హామీ అమలుకావడం లేదంటూ కూలీలు అంటూ మండిపడుతున్నారు. కాగా కొన్ని చోట్ల పనులకు రాకపోయినా కూలీలకు మస్టర్లు వేస్తుండటంతో కూలి మొత్తం తగ్గిపోతుందని కొందరు అధికారులు పేర్కొంటున్నారు. నిర్దేశించిన కొలతల మేరకు పనిచేస్తే గరిష్ట వేతనం లభిస్తుందని చెబుతున్నారు.



దొర్నిపాడు పొలాల్లో పత్తి తీస్తున్న కూలీలు

కూలీలకు అవగాహన కల్పిస్తున్నాం

ఉపాధి హామీ కూలీలకు రూ.300 కూలి రావాలంటే తప్పని సరిగా కొలతల ప్రకారం పనిచేయాల్సి ఉంది. క్షేత్ర సహాయకుల ద్వారా రోజూ అవగాహన కల్పిస్తున్నాం. కొంత మంది పనికి రాకపోయినా మస్టర్‌లో కూలీలు వేస్తున్నట్లు సమాచారం ఉంది. దీంతో పనికి వచ్చిన కూలీలకు వేతనం తగ్గిపోయే ప్రమాదం ఉంది. ప్రతి కూలీకి గరిష్ట వేతనం వచ్చేలా చర్యలు చేపడతాం

– గంగన్న, ఏపీఓ, దొర్నిపాడు

మండలాల వారీగా ఉపాధిహామీ కూలీలు, సగటున లభించిన వేతనం వివరాలు..

మండలం	జాబ్ కార్డులు	కూలీల సంఖ్య	జనవరి నెలలో సగటు కూలి రూ.ల్లో	ఫిబ్రవరి నెలలో సగటు కూలి రూ.ల్లో
ఆళ్లగడ్డ	8,491	16,246	257	249
చాగలమర్రి	9,489	17,282	280	274
దొర్నిపాడు	5,781	11,229	263	259
రుద్రవరం	9,584	18,206	271	262
శిరివెళ్ల	10,336	20,367	269	261
ఉయ్యాలవాడ	5351	9,986	275	267
మొత్తం	49,032	93,316		

కొనసాగుతున్న భూముల రీసర్వే

ఉయ్యాలవాడ : శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకంలో భాగంగా మండలంలోని ఎస్.కొత్తపల్లె గ్రామంలో భూముల రీ సర్వే కొనసాగుతోంది. 613 ఎకరాల్లో సర్వే పూర్తి చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాసులు బుధవారం వెల్లడించారు. ఈ గ్రామాన్ని ప్రభుత్వం మొదటి విడత సర్వేలో పైలట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక చేసిందన్నారు. గ్రామంలో 251 మంది రైతులకు చెందిన 973.20 ఎకరాల విస్తీర్ణంలో రికార్డుల స్వచ్ఛీకరణ వర్క్‌షాప్‌లో సందేహాలను నివృత్తి చేస్తూ సర్వేలో ఎలాంటి తప్పులు దొర్లకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. భూముల విస్తీర్ణాన్ని నాలుగు బ్లాక్‌లుగా విభజించి ముందస్తుగా గ్రామంలో ఐదుగురు రైతులకు నోటీసులు అందజేసి ప్రతి రోజు 20 ఎకరాల చొప్పున రీ సర్వే చేస్తున్నామని చెప్పారు. 360.96 ఎకరాలు సర్వే చేయాల్సి ఉందని, ఈ నెల 28వ తేదీ నాటికి పూర్తి చేయాలని మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్‌ఓలకు సూచించామని వివరించారు.



ఎస్.కొత్తపల్లెలో రైతులతో కలిసి సర్వే చేస్తున్న మండల సర్వేయర్

ధైర్యానికి ప్రతి రూపం ఛత్రపతి శివాజీ

నంద్యాల(వ్యవసాయం): స్వరాజ్యం, సనాతన ధర్మ స్థాపన కోసం పోరాడిన శివాజీ ధైర్యానికి ప్రతి రూపమని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళీశ్వరరెడ్డి, కశెట్టి చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని రాష్ట్రీయ ధర్మ రక్షాదళ్ గోసేవక్, విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ నాయకులు, హిందూ సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పట్టణంలో శోభా యాత్ర నిర్వహించారు. ముందుగా శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శోభయాత్ర టెక్కెలోని మార్కెట్ యార్డు నుంచి శ్రీనివాసనగర్, సంజీవనగర్, గాంధీచౌక్, చివరకు బైటిపేట కోదండ రామాలయం వరకు కొనసాగింది. మేడా మురళీ, సుధాకర్, పోలేపల్లి సందీప్, రమేష్‌బాబు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): స్టేట్ లెవెల్ సైన్స్ ఒలంపియాడ్‌లో గురురాజ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చాటారని గురురాజ ఇంగ్లిష్ మీడియం స్కూల్ డైరెక్టర్ షేక్షావలిరెడ్డి బుధవారం తెలిపారు. సుచిర్ ఇండియా ఫౌండేషన్ ఈనెల 17న హైదరాబాద్‌లో నిర్వహించిన సీవీరామన్ యంగ్ జీనియస్ స్టేట్ లెవెల్ సైన్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ చూపడంతో అదే రోజు హైదరాబాద్‌లోని లలితా కళాతోరణంలో ఫౌండేషన్ చైర్మన్ లయన్ కిరణ్, తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రముఖ సినీ నటుడు రావు రమేష్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్, ప్రశంసా పత్రాలు,జ్ఞాపికలను అందుకున్నట్లు తెలిపారు. 6వ తరగతి విభాగంలో స్టేట్ లెవెల్‌లో గోల్డ్ మెడల్ వరుసగా మూడు సార్లు సాధించడం విశేషమన్నారు. 3, 4, 5, 6, 7, 8, 9 తరగతుల విభాగాల్లో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించినట్లు వివరించారు.

సంక్షిప్తం

జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

గోస్పాడు: జొన్నల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మార్క్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జొన్న దిగుబడులను విక్రయించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మార్కెట్లో జొన్న రైతుకు సరైన గిట్టుబాటు ధర లేక తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని, ప్రభుత్వం మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కోరారు. ఏపీ కౌలు రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోనున్న వక్ఫ్ బోర్డు స్థలంలో మాజీ ఇక్రా పాఠశాలలో ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ప్రజా సమస్యల పోరాట కమిటీ నాయకులు ఎస్ఎండీ రఫీ, ఆకుమల్ల రహీం, మన్నెం జానయ్య, ఏసుదాసు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో విద్యార్థులతో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ 2018లో ఉర్దూ జూనియర్ కళాశాలను మంజూరు చేశారని గుర్తు చేశారు. అయితే ఇంతవరకు కళాశాలను ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. అర్షద్, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

భారతీయులకు సంకెళ్లు వేయడం దారుణం

నంద్యాల(న్యూటౌన్): భారతీయులకు సంకెళ్లు వేసి యుద్ధ ఖైదీల్లా పంపించడం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు శివ, అధ్యక్షుడు మధుశేఖర్ పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అమెరికాలో వలసదారుల ఉన్న భారతీయులను కాళ్లు, చేతులకు సంకెళ్లు వేసి యుద్ధ ఖైదీలుగా పంపించడం దారుణమన్నారు. వికసిత్ భారత్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఏ మాత్రం సరిపోదన్నారు. రాహుల్, రాముడు, గంగాధర్, దేవ, సుధాకర్, మహేంద్ర, సాయి పాల్గొన్నారు.

లింగందిన్నె చేరిన పార్వేట పల్లకీ

రుద్రవరం: మండలంలోని టీ.లింగందిన్నెలో ఉత్సవమూర్తులు జ్వాలా నరసింహస్వామి,ప్రహ్లాదవరదస్వామి వారికి ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. పార్వేటోత్సవాల్లో భాగంగా స్వామి వారి పల్లకీ టి.లింగందిన్నెకు చేరుకుంది. బుధవారం స్వామి వారి పల్లకీ గ్రామంలోని పలు తెలుపులపై కొలువుదీరగా గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారి పల్లకీ రావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



టి.లింగందిన్నెలో పూజలందుకున్న ఉత్సవమూర్తులు

ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్య

ఉయ్యాలవాడ : రైతు రిజిస్ట్రీ ద్వారా ఇక నుంయి ప్రతి రైతుకు 11 అంకెలతో యూనిక్ కోడ్ కేటాయించనున్నట్లు మండల వ్యవసాయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని తుడుమలదిన్నె గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీపై అవగాహన కల్పించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సంక్షేమ పథకాలు, పంట నష్టపోయిన రైతుల పరిహారం పొందాలంటే భూ యజమానులు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. ఈ ఐడీని ఉపయోగించి కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా బ్యాంకు లింకేజీతో కూడిన ఆర్థిక సేవలతో పాటు పంటలకు కనీస మద్దతు ధర కూడా పొందవచ్చన్నారు. రైతు పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డు, మొబైల్ తీసుకెళ్లి రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించుకోవాలని చెప్పారు.

క్షయ వ్యాధిపై అవగాహన

నంద్యాల(న్యూటౌన్): స్థానిక మున్సిపల్ బాలికల ఉర్దూ పాఠశాలలో బుధవారం క్షయవ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెచ్ఎం ఫయాజుర్ రహీం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో టీబీ అధికారి యాగంటిరెడ్డి వ్యాధి గురించి విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు ఎస్తేర్‌రాణి, ఏఎస్ఎం భాగ్యరత్నమ్మ, షహీన్‌బీ పాల్గొన్నారు.

కార్మికులు ఈ–శ్రమ్ కార్డు తీసుకోవాలి

నంద్యాల(అర్బన్): చిరువ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులంతా ఈ–శ్రమ్ కార్డు తప్పనిసరిగా కలిగి ఉండాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ బసిరున్నిసా బేగం తెలిపారు. స్థానిక ఆల్ మదద్ కంప్యూటర్ సెంటర్‌లో ఉచిత ఈ–శ్రమ్ కార్డు నమోదు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాదాపు 200 మంది చిరువ్యాపారులను నమోదు చేయించారు. ఆకుమల్ల రహీం, మహబూబ్‌బాషా, అల్తాఫ్, రఫీ పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఉద్యోగ మేళా

నంద్యాల(వ్యవసాయం): స్థానిక ఆర్టీసీ డిపో గ్యారేజీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో డ్రైవర్లు, శ్రామిక్‌గా శిక్షణ పొందిన అభ్యర్థులకు బుధవారం ఉద్యోగ మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డిపో మేనేజర్ గంగాధర్‌రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. డ్రైవర్, శ్రామికులకు సంబంధించిన పలు సూచనలు, సలహాలిచ్చారు. 80మందికి ఇంటర్వ్యూలు నిర్వహించగా.. 52 మంది అభ్యర్థులు డ్రైవర్, శ్రామిక్ పోస్టులకు అర్హత సాధించారన్నారు. అసిస్టెంట్ మెకానిక్ (క్లీనర్) పోస్టుకు హెవీ లైసెన్స్ కలిగి ఉండి అర్హత కలిగిన వారు డిపో మేనేజర్‌ను సంప్రదించాలని తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ కిశోర్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- ఎమ్మెల్యే అఖిలప్రియ, ఏవీ సుబ్బారెడ్డి మధ్య మరోసారి విభేదాలు
- ఏవీ సుబ్బారెడ్డి ఇంటి ముందు నిర్మాణాలను కూల్చాలని ఎమ్మెల్యే హుకుం
- కూల్చేందుకు ప్రయత్నించిన మున్సిపల్ అధికారులు
- ఆళ్లగడ్డలో హైటెన్షన్



ఏవీ సుబ్బారెడ్డి ఇంటి సమీపంలో మోహరించిన పోలీసులు

ఆళ్లగడ్డ: ఆళ్లగడ్డ టీడీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. ఎమ్మెల్యే అఖిలప్రియ, టీడీపీ సీనియర్ నేత ఏవీ సుబ్బారెడ్డి వర్గాలు మరోసారి ఢీ అంటే ఢీ అని తలపడేందుకు సిద్ధపడటంతో బుధవారం పట్టణంలో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఏవీ సుబ్బారెడ్డి ఇంటి ముందు చేపట్టిన నిర్మాణాలు దారికి అడ్డంగా ఉన్నాయని కూల్చేయాలని ఎమ్మెల్యే మున్సిపల్ అధికారులను ఆదేశించింది. మున్సిపల్ అధికారులు అక్రమ నిర్మాణాలు కూల్చేందుకు బందోబస్తు కల్పించాలని పట్టణ పోలీసులకు సమాచారం ఇవ్వగా అందులో కమిషనర్ సంతకం లేదని తాము భద్రత ఇవ్వలేమని పోలీసులు చెప్పినట్లు సమాచారం. అయినా పట్టువదలని ఎమ్మెల్యే నియోజకర్గంలోని తమ కార్యకర్తలను పిలిపించడంతో ఎమ్మెల్యే అనుచరులు పెద్ద సంఖ్యలో ఆళ్లగడ్డ చేరుకున్నారు. ఎమ్మెల్యే అనుచరులతో పాటు మున్సిపల్ సిబ్బంది జేసీబీతో నిర్మాణాలను కూల్చేందుకు అక్కడకు చేరుకున్నారు. దీంతో ఏవీ సుబ్బారెడ్డి సైతం తన అనుచరులతో సిద్ధంగా ఉండటం, ఎలా కూల్చుతారో చూస్తామని అడ్డుకోవడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు ఇరువర్గాలను సముదాయించడంతో సమస్య తాత్కాలికంగా సద్దుమనిగింది.

రూ.72 కోట్ల బడ్జెట్‌కు ఆమోదం

- కౌన్సిల్‌లో ఆమోదించిన చైర్‌పర్సన్ మాబున్నిసా



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మాబున్నిసా



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

నంద్యాల(న్యూటౌన్): 2025–26కి రూ.72.78 కోట్ల బడ్జెట్ కౌన్సిల్‌లో ఆమోదించినట్లు చైర్‌పర్సన్ మాబున్నిసా తెలిపారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన బడ్జెట్ సమావేశం నిర్వహించారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది బడ్జెట్‌కు రూ.13కోట్లు తక్కువగా ఉంది. కార్యక్రమానికి కమిషనర్ నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. కో ఆప్షన్ మెంబర్ సలాముల్లా మాట్లాడుతూ మున్సిపల్ ఆసుపత్రి నిర్వహణ సరిగా లేదని, అభివృద్ధికి సహకరించాలని, ఈ బడ్జెట్‌లోనైనా మున్సిపల్ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం కౌన్సిలర్ దేశం సులోచన మాట్లాడుతూ శానిటేషన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. పట్టణంలో ఫాగింగ్ మిషన్ల సంఖ్య పెంచాలన్నారు. అలాగే మున్సిపల్ అధికారులు కుక్కలు, పందులు, కోతలు, దోమల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గత బడ్జెట్ కంటే పది శాతం ఆదాయం రావచ్చని అంచనాలు వేయాల్సింది పోయి గతం కంటే రూ.13.83 కోట్లు లోటు చూపడాన్ని చూస్తే.. బడ్జెట్ మూలసూత్రాన్ని పాటించ లేదని కో ఆప్షన్ సభ్యుడు పడకండ్ల సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. వైస్ చైర్మన్లు గంగిశెట్టి శ్రీధర్, పాంషావలి, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల రుణాలకు ఇంటర్వ్యూలు



దొర్నిపాడులో దరఖాస్తుల పరిశీలనకు హాజరైన దరఖాస్తుదారులు



రుద్రవరంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

శిరివెళ్ల: వివిధ కార్పొరేషన్ల యూనిట్లకు బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరిగాయి. మండలంకు 52 బీసీ, 5 కాపు, 3 ఈబీసీలకు యూనిట్లు మంజూరయ్యాయి. వాటికి 446 దరఖాస్తులు రాగా ఇంటర్వ్యూలకు 218 మంది హాజరయ్యారు. ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఆధ్వర్యంలో బ్యాంక్ మేనేజర్లు అభ్యర్థుల విద్యార్హతలు, కులం, ఆదాయం, యూనిట్ల స్థాపనపై గల ఆసక్తిని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఆర్డీ శ్రీనివాస శర్మ, బ్యాంక్ మేనేజర్లు కార్తికేయరెడ్డి, సాయినాథ రెడ్డి, శివారెడ్డి, షేక్షావలి పాల్గొన్నారు.

- దొర్నిపాడు: కార్పొరేషన్ ద్వారా వెనుగబడిన తరగతులు (బీసీ),ఎవెనుకబడిన అగ్రకులాల ఏఈడబ్ల్యూఎస్ (ఈబీసీ, కమ్మ, రెడ్డి, ఆర్యవైశ్య, బ్రాహ్మణ)లు స్వయం ఉపాధి పొందేందుకు అధికారులు దరఖాస్తులను ఆహ్వానించారు. ఈసందర్భంగా మండలానికి మొత్తం 24 యూనిట్లు మంజూరు కాగా 477 మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో బుధవారం బ్యాంకు అధికారులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దరఖాస్తులను పరిశీలించారు. దొర్నిపాడు ఏపీజీబీ 7యూనిట్లకు 42.65, వెనుకబడిన అగ్రకులాల కోసం ఒక యూనిట్‌కు రూ.2లక్షలు, యూనియన్ బ్యాంక్ 6 యూనిట్లకు రూ.34లక్షలు, యూనియన్ బ్యాంకు ఒక యూనిట్‌కు రూ.1.50 లక్షలు కేటాయించినట్లు ఎంపీడీఓ తెలిపారు. అలాగే కోవెలకుంట్ల యూనియన్ బ్యాంకు 5 యూనిట్లకు రూ.18.25లక్షలు, గోస్పాడు ఏపీజీబీ బ్యాంకు 5 యూనిట్లకు రూ.23.25 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. 24 యూనిట్లను 477 మందికి ఎలా సర్దుబాటు చేయాలో తెలియక నాయకులు తలలు పట్టుకుంటున్నారు.
- రుద్రవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం వివిధ బ్యాంకుల అధికారులు బీసీ కార్పొరేషన్, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ కింద మండలానికి 60 యూనిట్లు మంజూరయ్యాయి. వాటి కోసం మండలం నుంచి దాదాపు 630 మంది దరఖాస్తులు చేసుకున్నారు.వారిలో ఇంటర్వ్యూకు 335 మంది హాజరైనట్లు మండల పరిషత్ అధికారులు తెలిపారు. ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు రుద్రవరం, ఆలమూరు, ఆళ్లగడ్డ, గాజులపల్లె, ఎర్రగుంట్లకు చెందిన కెనరాబ్యాంక్, యూనియన్ బ్యాంక్,ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్,బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉద్యోగులు పాల్గొన్నారు.
- చాగలమర్రి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎంపీపీ వీరభద్రుడు ప్రారంభించి, పరిశీలించారు. అధికారులు మాట్లాడుతూ మండలానికి అన్నీ బ్యాంకుల శాఖల పరిధిలోని గ్రామాలకు కాపు,బలిజ,తెలగ,ఒంటరి కులాలకు 55 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. వీటి ద్వారా అర్హులైన లబ్ధిదారులకు రూ.1.18 కోట్లు రుణాలు అందజేస్తామని చెప్పారు. రుణాలకు సంబంధించి మండలంలో మొత్తం 489 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 257 మంది ఇంటర్వ్యూకు హాజరయ్యారని వివరించారు.
- ఉయ్యాలవాడ : స్వయం ఉపాధి కోసం వివిధ కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తుదారులకు గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులతో పాటు ఒర్జినల్ సర్టిఫికెట్లను తీసుకు రావాలని సూచించారు. వివిధ బ్యాంకుల ప్రతినిధులు హాజరై రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తులను పరిశీలిస్తారని పేర్కొన్నారు.